# క్రైస్తవులు పనికి వెళ్లినప్పుడు

# (6:5-9)

క్రైస్తవులైయుండడమంటే – మన జీవితాల్లోని ప్రతి భాగాన్ని, కడకు మనం పని చేసే విధానాన్ని కూడా క్రీస్తు రూపుదిద్దువాడై ఉంటాడని అర్థం. తమ యజమానులకొరకు పనిచేసే బానిసలకు వారి పని విషయమై పౌలు యిలా ఉపదేశిస్తున్నాడు:

> దాసులారా, యథార్థమైన హృదయముగలవారై భయముతోను వణకుతోను క్రీస్తునకువలె, శరీర విషయమై మీ యజమానులైనవారికి విధేయులైయుండుడి. మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు, కంటికి కనబడుటకే కాక, క్రీస్తు దాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు, మనుష్యులకు చేసినట్టుకాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా సేవచేయుడి. దాసుడైనను స్వతంత్రుడైనను మీలో ప్రతివాడును ఏ సత్కార్యముచేయునో దాని ఫలము ప్రభువువలన పొందునని మీరెరుగుదురు. యజమానులారా, మీకును వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదరించుట మాని, ఆ ప్రకారమే వారియెడల ప్రవర్తించుడి (6:5-9).

5:18లో, "ఆత్మ పూర్ణులైయుండుడి" అనే పౌలు యొక్క ఆజ్ఞ సందర్భంలో ఈ వచనాలను అర్థం చేసికోవాలి. దేవుని పరిశుద్ధాత్మ యొక్క ప్రభావం క్రింద క్రైస్తవులు జీవించాలని పౌలు పిలుపునిచ్చాడు. ఇది దేవుని చిత్తానికి లోబరచుకొనడానికి సంబంధించింది. ఆయన వాక్యం మనలో నివసింప నియ్యడంతో అది కూడియుంటుంది. ఆత్మతో నింపబడితే వచ్చే కొన్ని ఫలితాలను పౌలు పేర్కొన్నాడు: కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మ సంబంధమైన పాటలతోను ఒకనినొకడు హెచ్చరించడం; ఒకని కొకడు లోబడి ఉండడం అందులో చేర్చబడ్డాయి. ఇలా లోబడడం భార్యభర్తలు, తల్లిదండ్రులు పిల్లలు, బానిసలు యజమానులతో కూడియుంటుంది.

సందర్భాన్ని పోగొట్టుకోవద్దు లేక విడిచిపెట్టవద్దు. పని చేసే స్థలానికి సంబంధించిన సందేశం ఆత్మ పూర్ణులైయుండుడి అనేదానినుండి నేరుగా ప్రవహిస్తుంది. మరోవిధంగా చెప్పాలంటే, ఉద్యోగంలో మనం క్రైస్తవులుగా జీవించలేకపోయామంటే, దేవుడు కోరినట్టి క్రైస్తవులుగా ఉన్నట్టు ఎవడును చెప్పుకోలేడు. నమ్మకమైన ఉద్యోగస్తులుగా తాము పని చేసినప్పుడు మాత్రమే ఆత్మతో నింపబడిన క్రైస్తవ జీవితాలను మనం ప్రదర్శింప గలుగుతాం.

## నమ్మకమైన ఉద్యోగస్థులు

ఇక్కడ ప్రత్యేకించి పౌలు బానిసలకు, యజమానులకు మధ్య ఉండవలసిన సంబంధాన్ని గూర్చి మాట్లాడాడు. తన కాలంలో, ప్రాథమికంగా అదే పని చేసే స్థలంలోని సంబంధమైయుండేది. ఆ సూత్రాన్ని వర్తింపజేసి, పనికి పెట్టుకునేవాడు/పని చేసేవాడు అనే బాంధవ్యాన్ని చూస్తున్నాం. ఉద్యోగస్తులకు పౌలు నాల్గు హెచ్చరికలనిచ్చాడు.

1. **లోబడియుండుడి.** "దాసులారా, ... మీ యజమానులైనవారికి విధేయులై యుండుడి" అని పౌలు అంటున్నాడు (6:5). ఈ స్వభావం ఎల్లవేళలా ఉండాలనడానికి పౌలు క్రియా వాచకపు కాలాన్ని ఉపయోగించాడు. చట్ట విరుద్ధమైనది, అవినీతికి సంబంధించినది, లేదా బయలుపరచబడిన దేవుని చిత్తానికి వ్యతిరేకమైనది ఉద్యోగంలో పెట్టుకున్నవాడు చెప్పనంతకాలం – ఉద్యోగస్తుడు తన యజమాని యొక్క మాటలకు, ఉపదేశానికి లోబడియుండాలనేది పౌలు చెప్పనుద్దేశించిన సందేశమైయుంది. ఉద్యోగంలో పెట్టుకునే కొందరు, అన్యాయంగాను, అజ్ఞానంగాను, కఠినంగాను, బుద్ధిహీనంగాను ఉండవచ్చు; క్రైస్తవ ఉద్యోగులైతే, తాము చేయగల శ్రేష్ఠమైనదానిని తన యజమానులకు యివ్వ బద్ధులైయున్నారు. 1 పేతురు 2:18–20లో మనం యిలా చదువుతాం,

> పనివారలారా, మంచివారును సాత్వికులునైనవారికి మాత్రము కాక ముష్కరులైన మీ యజమానులకును పూర్ణభయముతో లోబడియుండుడి. ఎవడైనను అన్యాయముగా శ్రమపొందుచు, దేవునిగూర్చిన మనస్సాక్షి కలిగి, దుఃఖము సహించినయెడల అది హితమగును. తప్పిదమునకై దెబ్బలు తినినప్పుడు మీరు సహించినయెడల మీకేమి ఘనము? మేలుచేసి బాధపడునప్పుడు మీరు సహించినయెడల అది దేవునికి హితమగును; ఇందుకు మీరు పిలువబడితిరి.

మన పని అనంగీకారమైనప్పుడు, మన రక్షణ సందేశాన్ని ప్రజలు లక్ష్యపెట్టరు. మన ఉద్యోగంలో పెద్దగా ఫిర్యాదులు చేసేవారమైయుంటే మనం వారికి చెప్పేదాన్ని వారు వినరు. ఇతరులకొరకు మనం పని చేస్తూ ఉన్నంతకాలం, వినయమైన మనస్సుతోను, విధేయతతోను వారికి లోబడియుండాలి.

2. **మర్యాదస్థులైయుండుడి.** పౌలు యిలా అన్నాడు: "దాసులారా, యథార్థమైన హృదయముగలవారై భయముతోను వణకుతోను ... శరీర విషయమై మీ యజమానులైన వారికి విధేయులైయుండుడి." పనికిపెట్టుకున్నవాడు మర్యాదస్థుడైనా కాకపోయినా, క్రైస్తవ పనివారు గౌరవించువారైయుండాలి. ఇంతకు విషయం ఆ వ్యక్తి కాదు, దేవుని ఏర్పాటే. అధికారానికి లోబడడం అనేది దేవుని సంకల్పమైయుంది. దేవుడు ఆ ఏర్పాటును జీవిత విధానంతోనే నిర్మించాడు. అధికారమనే సూత్రానికి విరోధంగా తిరుగుబాటు జరిగితే, సమాజంగా జనులు నిలిచేదానికి అవకాశముండదు. అది భార్యభర్తల విషయంలోనేగాని, తల్లిదండ్రులు పిల్లల విషయంలోనేగాని, యజమానులు పనివారు అనే విషయంలోనేగాని అధికారము లోబడడమనే సూత్రం వర్తిస్తుంది. దాన్ని మనం అలక్ష్యం చేస్తే, అనేక సమస్యలు బయలుదేరుతాయి. దేవుని విధానాన్ని గౌరవించడం కొరకు నమ్మకమైన క్రైస్తవుడు లోబడియుంటాడు. ఫిర్యాదులు లేకుండ, విమర్శలు చేయకుండ, నియమానికి

విరోధంగా తిరుగుబాటు చేయకుండ అతడు న్యాయబుద్ధి కలిగియుంటాడు.

3. **మీ ఉద్దేశాలను పవిత్రంగా ఉంచుకొనండి.** అధికారికి లోబడడంలో గల ఉద్దేశ మేమి? క్రీస్తు ప్రభువుకు మనం ఎలా లోబడియుంటామో, భూ సంబంధులైన మన యజమానులకు అలా లోబడియుండాలని ప్రభువు ఎదురు చూస్తున్నట్లు పౌలు తెలిపాడు (6:5). మన పనితో సహా, జీవితంలో మనం చేసే ప్రతిదీ దేవుని మహిమపరచునదై యుండాలి: "కాబట్టి మీరు భోజనముచేసినను పానముచేసినను మీరేమి చేసినను సమస్తమును దేవుని మహిమకొరకు చేయుడి" (1 కొరింథీ. 10:31). "మరియు మాటచేత గాని క్రియచేత గాని, మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్సీ. 3:17); "ప్రభువువలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి; మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులైయున్నారు" (కొలస్సీ. 3:23, 24).

నీ ఉద్యోగం అంత ప్రాముఖ్యమైనది కానట్టు నీవు భావించవచ్చు. నీవు చేసే పని నీకు నచ్చింది కాకపోవచ్చు, నీ యజమాని అంటే నీకు యిష్టం లేకపోవచ్చు. ఏదియెలాగున్నా, నీ పనిని ప్రభువునకు చేస్తున్నట్టు చేస్తే, నీవు దేవుని మహిమపరచగలవు. గనుక దేవుని మహిమకొరకు దాన్ని చేయి. ఆ హేతువును బట్టి నీ యజమానికిని, నీ పనికిని నీ శ్రేష్ఠమైన దాన్ని సమర్పించు.

4. **శ్రేష్ఠమైనదానికి అప్పగించుకొనడం.** మనం చెప్పేదానిలో గాని చేసేదానిలో గాని వెనుకనున్న ఉద్దేశం దేవుని మహిమపరచడమే గనుక, మన పని స్థలంలో శ్రేష్ఠమైనదాన్ని చేయడానికి మనలను మనమే అప్పగించుకోవాలి. క్రీస్తు ప్రభువును రూపచిత్రంలోనికి మాటి మాటికి తీసికొని రావడంవలన పౌలు దీన్ని నొక్కి పలుకుతున్నాడు. క్రీస్తు ప్రభువుకు లోబడినట్టుగా భూ సంబంధమైన మన యజమానులకు లోబడవలసినవారమై యున్నాం (6:5). "... కంటికి కనబడుటకే కాక, క్రీస్తు దాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు ..." అంటూ 6వ వచనంలో మాట్లాడాడు. శ్రేష్ఠమైనదానిని జరిగించడం అనే భావన 7వ వచనంలోను ఉంది. "మనుష్యులకు చేసినట్టుకాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా చేయుడి."

హై స్కూలులో ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లాసు నాకు జ్ఞాపకం వస్తుంది. ఆ క్లాసు సమయంలో ప్రతి దినం మేము (ఎక్సర్‌సైజ్) వ్యాయామం చేయవలసి ఉంటుంది. కోచ్ మా మధ్య నిలిచియున్నప్పుడు, ఒకసారికి క్లాసులో సగం మందిని మాత్రమే అతడు చూడగలడు. అతడు కుడివైపు చూస్తాడు, కుడివైపు ఉన్నవారందరు బలంగా వ్యాయామం చేస్తారు. అయితే ఎడమవైపుననున్నవారు కొంత విశ్రమిస్తుంటారు. పని స్థలాల్లో కొన్నిసార్లు అలాగే జరుగుతూ ఉంటుంది. యజమానుడు చుట్టూ కన్పించేటప్పుడు మాత్రమే కొందరు శక్తివంచన లేకుండా పని చేస్తారు. శ్రేష్ఠమైనదాన్ని చేయాలనే తీర్మానం వారికి ఏ మాత్రమూ లేదు.

దేవుడు పనివాడన్నట్టు ఆదికాండం 1 చూపుతుంది. ఆయన లోకాన్ని సృజించాడు. ఆయన తన పనిలో శ్రేష్ఠమైనదాన్ని చేయడానికి తలపెట్టాడు. "దేవుడు తాను చేసినది

యావత్తును చూచినప్పుడు అది చాలమంచిదిగా నుండెను" (ఆది. 1:31). క్రైస్తవులు ఎల్లప్పుడు కష్టపడి పని చేస్తూ వారి శ్రేష్ఠమైనదాన్ని చేయబద్ధులైయున్నారు. వారు ఎక్కడ పనిచేసినా, బహు సమర్పణతో కూడిన పనివారైయుండాలి. జాన్ స్టాట్ యిలా తెలిపాడు:

> ప్రభువైన యేసే స్వయంగా తినబోతున్నాడనే భావంతో ఒక స్త్రీ తన వంట పని చేయవచ్చు, లేదా ఆయన ఆ యింటికి గౌరవపదమైన అతిథిగా ఉండబోతున్నాడనే భావంతో తన యింటిని శుభ్రం చేసికోవచ్చు. అలాగే, ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు నేర్పించవచ్చు. వైద్యులు రోగులను పరామర్శించవచ్చు, నర్సులు వారి విషయమై శ్రద్ధ తీసికోవచ్చు, వకీళు కక్షిదారులకు (clients) సహాయపడవచ్చు, షాపులో సహాయకులు ఖాతాదారులకు సేవ చేయవచ్చు. ఎకౌంటెంట్లు పుస్తకాలను ఆడిట్ చేయవచ్చు, సెక్రటెరీలు ఉత్తరాలను టైపు చేయవచ్చు – ఈ ప్రతి సందర్భంలోను వారు క్రీస్తుకే పని చేసినట్టు చేయవచ్చు.[1]

## దయగలిగిన యజమానులు

దయగల యజమానులైయున్నప్పుడు, క్రైస్తవులు ఆత్మతో నింపబడిన తమ జీవితాలను ప్రదర్శిస్తారు. యజమానులకు లేక ఉద్యోగంలో పెట్టుకున్నవారికి పౌలు ఏమి చెప్తుతున్నాడో క్లుప్తంగా చూడు: "యజమానులారా, మీకును వారికిని యజమానుడైన వాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదరించుట మాని, ఆ ప్రకారమే వారియెడల ప్రవర్తించుడి" (6:9).

యజమానులైనవారికి పౌలు మూడు సంగతులను సూచించాడు. నేడు పనినిచ్చేవారు వాటిని వెంటాడవలసినవారై ఉన్నారు.

1. **విధేయులైయుండుడి**. "ఆ ప్రకారమే వారియెడల ప్రవర్తించుడి" అని అతడంటున్నాడు. "ఆ ప్రకారమే" అనేదాన్ని నేను ఏమని గ్రహించానంటే – పనివారి యెదుట ఏ గురి, లేక ఉద్దేశం పెట్టబడిందో, దానినే సూచిస్తుందని – నీవు చెప్పే లేక చేసేదానంతటిలో దేవుని మహిమపరచడమే. దేవుని మహిమపరచేలా నీవు నడిపించాలని దేవుడు ఎదురు చూస్తున్నాడు. నీ మాట వినేవారందరిని దేవుని రాజ్యం యొక్క ప్రమాణాల ప్రకారం నడిపించాలి, సువర్ణ సూత్రం ప్రకారం పని చేయాలి (లూకా 6:31 చూడు) మరియు నీవు సేవించే ప్రభువును వారు తృణీకరించే హేతువు లేకుండునట్లు, నీ యొద్ద పనివారిని మర్యాదగా చూడు.

2. **దయగా ఉండండి**. కఠినంగా ఉండవద్దు లేదా వారిని భయపెట్టవద్దు. "బాస్" యజమాని ఎవరో ప్రతి ఒక్కరు తెలిసికోవాలనే అవసరతలో దైవభక్తిగల నాయకత్వం ఉండదు. క్రైస్తవ యజమాని ఎన్నడును దుర్భాషలు మాట్లాడేవాడుగా గాని, దయలేని వాడుగా గాని ఉండదు. కాని ఎల్లవేళలా దయగా ఉండువాడుగాను, లక్ష్యపెట్ట ప్రయాస పడువాడుగాను ఉంటాడు. అంటే, అవసరమైన చోట కఠినంగా వ్యవహరించడని దీని భావం కాదు. అయితే నీ స్వభావము, ప్రవర్తన అంతా ఎల్లవేళల క్రీస్తు మనస్సుచేత వశపరచుకో బడవలసినదైయుంటుంది.

3. **వినయముగా ఉండండి**. ఈ ఉద్దేశాన్ని పౌలు యిలా సూచిస్తున్నాడు: "మీకును

వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై" యజమానిగా నీవు ఎలా దినాలు సాగిస్తున్నావో పక్షపాతములేని తీర్పరులకు తీర్పరియైనవాడు కనిపెట్టుతున్నాడు. నీవు యజమానుడవైనంత మాత్రంచేత నీ క్రింది ఉద్యోగులను బాధించడాన్ని చూచి ఆయన చూడనట్టుండలేడు. ఇతరులను మనం ఎంచు తీరునుబట్టి మనలను ఆయన బాధ్యులనుగా ఎంచుతాడు.

## ముగింపు

ఆదివారం క్రైస్తవుడుగా ఉన్నవాడు సోమవారం రోజున కూడా క్రైస్తవుడుగానే ఉండాలి. ఆరాధనలో క్రైస్తవుడుగా ఉన్నవాడు, పనిలో కూడ క్రైస్తవుడుగానే ఉండాలి.

మనలో ఎక్కువ మందికి ఉద్యోగాలున్నాయి. మనలో కొందరం ఉద్యోగస్తులం. మరియు కొందరు యజమానులుగా పని కలిగియున్నారు. దేవుని వాక్యం ఏమి చెప్పుతుందో మనమందరం ఆలోచింపవలసియుంటుంది. నిన్ను నీవు ఈ క్రింది ప్రశ్నలను అడుగుకో:

- "పని వద్ద దేవునికి మహిమ తెచ్చేలా నేను నడుచుకొంటున్నానా?"
- "శ్రేష్ఠమైన దానికి నన్ను నేను అప్పగించుకున్నానా?"
- "ఇతరుల యెడల నేను దయయు జాలియు కలిగియున్నానా?"
- "నా పైవారికి నేను యథార్థంగాను, నమ్మకంగాను, గౌరవమిచ్చేవానిగాను ఉన్నానా?"
- "నా పనిని నేను ముగించిన తరువాత, 'భళా, నమ్మకమైన మంచి దాసుడా' అని ప్రభువైన యేసు నాతో అనునా?"

పై ప్రశ్నలకు యథార్థమైన జవాబులిచ్చిన మీదట, కొన్ని తప్పులను ఒప్పుకొని దేవుని క్షమాపణ వేడుకోవాలనే తలంపు నీకు రావచ్చు. సమస్తము, అంటే పనిలో కూడా మనం చేసేదంతా దేవుని మహిమపరచేదిగా ఉండునట్లు మనలను మనం సమర్పించుకొందాం.

---

సూచనలు

[1]John R. W. Stott, *The Message of Ephesians: God's New Society*, The Bible Speaks Today, gen. ed. John R. W. Stott (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1979), 252.